

# నిశ్శబ్దాలు

"విషయాలన్నీ చెప్పు! నేను వింటు న్నానా లేదా అని పట్టించు కోకు! అర్థవంతమైనదీ, అర్థంలేనిదీ ఏదో ఒకటి! మాట్లాడుతూఉండు! చనిపోవటంగురించి అయినా పరవాలేదు! చనిపోయి బ్రతకటం గురించికూడా చెప్పు! జీసస్ గురించి, గుడ్‌ఫ్రైడే గురించి చెప్పు! మన డైరీల్లోని ఎరోటిక్ కలల గురించీ! మనల్ని గాయ పరచిన మేల్ ఏనిమల్స్ గురించి కూడా! ఏదీ దాచవద్దు! వాసనల గురించి అయినా పరవాలేదు. చావు వాసనో, స్పెర్మ్ వాసనో, ఆకుపచ్చని కలల వాసనో ఏదయినా పరవాలేదు! నిశ్శబ్దాల గురించి కూడా మాట్లాడు! కన్నీళ్ళ గురించి. తల్లుల గురించి, మన గురించి, మన కాలం గురించీ, ఏదయినా సరే మాట్లాడుతూ ఉండు!"

నేను మొదలు పెట్టాను. బయట కురుస్తున్నవాన జల్లు గురించి చెప్పాను. వానంటే భగవంతుడి దుఃఖం అనికూడా చెప్పాను. భగవంతుడికి లేని మరణం మానవుడి కెందుకు అనే ఉడుకుమోతు సందేహాన్ని కూడా చెప్పాను. 'గార్డినాల్' మాత్రగురించి చెప్పాను. మెదడుపై అది ఎట్లా పని చేస్తుందో కూడా చెప్పాను. భయం గురించి చెప్పాను. భయమంటే ఏళ్ళ తరబడి చీము కారే గాయం అని చెప్పాను. తను,నేను, ఇంకా చాలమంది మానుపుడు పడని గాయాలము అని చెప్పాను. పక్కగదిలోఅలికిడయి, ఆపివేశాను. పెద్దడాక్టరు, వెనుక పదిమంది కుర్రడాక్టర్లు. ఆగిగదిలోకి, చూసి అర్థంకాని మందుల భాష మాట్లాడుకొని వెళ్ళిపోయారు. కాసేపటికి ఇద్దరు నర్సింగ్ స్టూడెంట్లు వచ్చారు. ఇంజక్షన్ ఇచ్చి. ఇచ్చినట్లుగా కేస్‌షీట్లోరాసుకొని, ఒకే ఒక్క నిముషం మావైపు దీర్ఘంగా, నిట్టూర్పుగాచూసి, "నీకు చాలా ధైర్యం అక్కా" అంటూ నాచెవి దగ్గర గొణిగి వెళ్ళిపోయారు.

బయట ఒక బద్ధకపు ఆవులింత. పోలీసు బూటు చప్పుడు. తలుపు మళ్ళీమూసుకొంది. మళ్ళీనిశ్శబ్దం. "మాట్లాడు! మాట్లాడు తూనే ఉండు!" కళ్ళు తెరవకుండానే అడిగింది. నేను మళ్ళీమొదలుపెట్టాను. తల్లుల గురించి చెప్పాను. బలిష్టంగా, విశాలంగా కండరాలతో నిండిన ఒక 'తల్లి' గురించి చెప్పాను. "బర్రెగొడ్డులా ఎట్లాబలిసిందో!" "ఒంటిచేత్తో బస్తాని లేపి భుజంపై వేసుకొని" "అది మనిషి కాదు ఎనుబోతు!" "కొర్రలు. గొడ్డుమాంసం, పీతలు, బకాసరుడి తిండి!" "చర్మం గిడుస బారి ముఖం ఉబ్బి- మీసాలే తక్కువ! ఏ మగాడైనా ఎట్లా పడు కుంటాడు దానితో..." "నోరుతెరిస్తే మైకే..."

"చెప్పు! అట్లాంటి విషయాలే చెప్పు! నేను ఇష్టపడతాను." కలవరింతలాగా మాట్లాడు తోంది.

బయట వర్షం చప్పుడు. స్క్రీన్‌పై హింసను చూస్తున్నట్లుగా అద్దంలోంచి వర్షం. బెడ్‌పై సన్నగా బలహీనంగా ఆమె. చిన్న శిశువులా ముడుచుకొని పడుకొంది. కళ్ళు మూసుకొనే ఉంది. కాసేపు మాట్లాడుతుంది. నిద్రలాంటి తూలుడు. అంతలోనే ఉలికి పాటు. మెలుకువ. మళ్ళీ మాట్లాడుతుంది.

"పాపాయిల గురించి చెప్పు! ఎండిపోయిన రొమ్ములు, డబ్బాపాలు, డయేరియా! శవపేటికల గురించికూడా! అంత చిన్న శవపేటిక లెట్లా తయారు చేస్తారు?" ఒక దుఃఖపుతెర లేచింది. "నాలుగు నెలలైనా నిండనిబిడ్డ!" పెనురోదన తోసుకు వచ్చింది. "నేనెట్లా ఓర్చు కోనీదుఃఖం... అరుణా!" శరీరమంతా ధనుస్సులా సాగి, క్షణాల్లో అలజడిగా మారింది. శరీరమంతా ప్రకంపనం. కమలకు మళ్ళీ ఫిట్సు వచ్చాయి.

నర్సులు పరుగెత్తుకువచ్చారు. ఇంజక్షన్ ఇచ్చారు. తుఫాను ఆగిపోయింది. మళ్ళీ మగతగా, నిద్రగా మారిపోయింది కమల.

ఇదో హస్పటల్. నూటయాభై బెడ్ల హస్పటల్. చాలా ఏళ్ళ నాటిది. ఎన్నో దుఃఖాల్ని. చావుల్ని చూసింది.

కప్పు ఛాయ్‌తో నాతో స్నేహంకలిపారు నర్సింగ్ స్టూడెంట్లు. నన్ను 'అక్కా!' అని పిలిచారు. "నీకు భయం ఉండదా?" ఉదయం నుండి వాళ్ళ సందేహం అదే. "చుట్టాలా?" మరోసందేహం! "కాదు. స్నేహితులం, ఒకే ఆఫీసు" "ఏఆఫీసు?" "ఏం ఉద్యోగం ఆవిడకు?" "మొగుడున్నాడా? బంధువులున్నారా? ఉంటే ఎవరూరారేం?" చాలా సందేహాలు వాళ్ళకు. "మీరు నర్సులా? జర్నలిస్టులా? ఇన్ని చావులతరువాతకూడా మీలో క్యూరియాసిటీఉండటము ఆశ్చర్యమే! ఆమె పేరు ఫీనిక్స్! చస్తూండటము! బ్రతకటం! మళ్ళీచస్తూండటము...." విసుగ్గా బయటకు వెళ్ళారు వాళ్ళు.

మంచంపై కదలిక. లేచి కూర్చోవాలనే ప్రయత్నం చేస్తుంది. కాళ్ళు ముందుకు జరిపి, అట్లాపక్కకు తిరిగింది. బలహీనమైన పాదాల్ని నేలపై మోపాలని-వద్దని వారించే లోపలే-దబ్బుమని నేలపైపడింది. కమల చీరపై ఆకు పచ్చనిద్రవం జిగటజిగటగా. నోటి చుట్టూ, మెడపై శరీరం పొడవునా ధారలు కట్టి-

"ఆ ఆకుపచ్చని దేమిటి? ప్రాణమా? శరీరంలోంచి బయటకువస్తుందా?" భయంతో అడిగింది కమల. నవ్వడానికి ప్రయత్నించాను కానీ, నోరు తెరుచుకోలేదు.

"దానిపేరు 'బైల్'! దానిపేరు ప్రాణమో కాదో తెలియదు. బహుశా చావుకు ముందు ఎగిరే పచ్చజెండా ఏమో?" అన్నాను. "వద్దు అరుణా! చావుగురించి మాట్లాడకు!" కమల నీరసంగా గొణిగింది.

మరోసారి 'బైల్' లోపలి నుండిజెట్‌లా బయటకు వచ్చింది. నోట్లోంచి తెరలు తెరలుగా బయటకు వచ్చి, శరీరంపైనుండి జారి రూమ్, పొడవునా పడి, ఆకుపచ్చగా జిగటగా మెరుస్తూ-పుక్కిలించడానికి నీళ్లుయిచ్చి, తడిచిన చీరవిప్పి, మరో చీర చుట్టి, ఎత్తి మంచంపై కూర్చో బెట్టాను

తలను ఒడిలో పెట్టుకొని, తడి గుడ్డతో ముఖమంతా తుడిచాను. నుదురు. కళ్ళు, చెక్కిళ్ళు, ఒక్కొక్కటే ప్రేమగా నిమురుతూ, ఎండిన పెదాలను, పుల్ల లాంటి కంఠాన్ని, ఛాతీని, ఒడిలిపోయిన రొమ్ముల్ని, మృదువుగా, ఎంతో మృదువుగా, శరీరంతో రహస్య సంభాషణ చేస్తున్నట్లుగా-వేళ్లచివర నా ఆశల్ని, ప్రేమని పరిచి-నిమరసాగాను. తనో శిశువై, తల్లిలా స్పృశించాను. ముడు చుకుపోయిన పేగుల్ని, బొడ్డుని, కటిభాగాన్ని, పొడవాటికాళ్ళను, పాదాల్ని నిమిరాను.

"ఏం చేస్తున్నావు?" రెప్పలు విప్పి అడిగింది. "ప్రాణం పోస్తున్నావా?" మళ్ళీఅడిగింది. "అట్లా నువ్వు శరీరాన్ని నిమురుతూ ఉంటేహాయిగా ఉంది. బ్రతకాలని ఉంది. మళ్ళీ, ఇంత విధ్వంసం తరువాత కూడా! నాకు బ్రతకాలనుంది చాలాఏళ్ళపాటు! అరుణా! నన్ను బ్రతికించు!' ' కమల ట్రాన్స్‌లో ఉన్నట్లుగా మాట్లాడు తోంది.

"ఇందాకటి అమ్మ గురించి వినాలి! చెప్పు!"

"చెప్తాను! చెప్తాను!" నేను మొదలు పెట్టాను." ఆమె కుటుంబం నాశనమైంది. మొగుడు పక్షవాతం పాలయ్యాడు. బర్రెగొడ్లు బ్యాంకు వాడుపట్టుకెళ్ళాడు. గుడిసె అక్రమ స్థలంలో ఉందని పంచాయతీ వాళ్ళు కూల్చివేశారు. సెంటు పొలాన్ని అప్పుకింద షావుకారు లాగేసుకున్నాడు. ఎదురు తిరిగిన కొడుకును కిరాయి రౌడీల్ని పెట్టి చంపించాడు. ఇద్దరు ఆడపిల్లల్ని, మొగుణ్ణి పట్నానికి వలస పంపింది. వాళ్ళు వెళ్ళిపోయిన రెండో రోజున కొడవలితో షావుకారు తలనరికి వేసి రాత్రికి రాత్రి ఎటో అదృశ్యమైంది. ఆమెఇప్పుడో జానపద గాథ అయ్యింది. అక్కడ పుట్టిన పిల్లలందరకు ఆమె పేరేపెట్టు కుంటున్నారు!" "చెప్పు!చెప్పు! ఆమెగాథలన్నీ చెప్పు! ఆమె గురించి మాట్లాడటమే నేరముకదా! అందుకే రహస్యంగా. చిన్నగా, నాచెవిలోనే....చెప్తూఉండు!"

తలుపు పై టక్ టక్ మంటూ చప్పుడు. కుర్రడాక్టరు. ఐ.విడ్రిప్ సరిచేసి, ఒకసారి బి.పి చూసి, సంతృప్తిగా ముఖం పెట్టాడు. "మళ్ళీఎటాక్ వస్తే ముందుగా ఈ కాటన్ నోట్లోపెట్టాలి! కాళ్ళూ చేతులు ప్రొటెక్టు చేస్తూ.. ఇలా.." నాచేయిపట్టుకొని నొక్కాడు. అనుమానంగా చూశాను. "నో!నో! ఐయామ్ ఎగుడ్ డాక్టర్!" అతని ముఖంలో కంగారు. "బాగా షాక్ తిన్నటుంది! మందులేవీ పని చెయ్యటంలేదు. అందుకే ఈ జాగ్రత్తలు!" గుడ్ డాక్టరు హడివుడిగా బయటకు వెళ్ళాడు. బయట వాన ఉధృతం తగ్గినట్టుంది. చప్పుడు చెయ్యని పలుచటి జల్లు. గది ముందున్న పోలీసు పహరా ఆపినట్టున్నారు. చుట్టూరా నిశ్శబ్దం.

* * *

ప్రమాద కరమైనవీ, భయం కలిగించేవీ ఏమిటి జీవితంలో? కరువులు, నిరుద్యోగం. ఒంటరిజీవితం, కాదు! కాదు! తుఫాను రాత్రి, అగ్నిప్రమాదం. వీధి చివరన రౌడీ కాదు- పోలీసులు! హింస రుచి మరిగిన పోలీసులు! ఇట్లాంటి ఒక రాత్రి ఇంట్లో 'ఆల్ ఈజ్‌వెల్' అనుకుని ఆదమరచి నిద్రిస్తున్నప్పుడు-ఆదమరపు విధ్వంసదృశ్యంగా మారుతుంది. భద్రత, సుఖం, కలలాంటి జీవితం, అన్నీ ఒట్టిమాట లవుతాయి. పెద్దగా కారణం అవసరం లేదు. ఫలానా ఉగ్రవాది నీయింట్లో తలదాచుకున్నాడనో, ఫలానా బంద్ రోజు. బంద్ పాటించావనో, తెలంగాణా పట్టణాల్లో పెద్దగా కారణం అవసరం ఉండదు.

రాత్రి పది దాటింది హస్పటల్ బయట కలకలం. పోలీసుట్రక్కులు ప్రయాణిస్తున్న చప్పుడు. మైకులోంచి హెచ్చరిక, "కర్ఫ్యూమొదలైంది రోడ్డుపై ఎవరూ కనపడకూడదు."

* * *

"కర్ఫ్యూ!కర్ఫ్యూ!" భయంతో కమల

"అవును కర్ఫ్యూ! కర్ఫ్యూనే!" సమాధానంగా నేను.

"తలుపులన్నీ ముయ్యి! కర్టెన్లు వెయ్యి! లైట్లు ఆర్పివెయ్యి! మనుషులెవరూలేరని ప్రకటించు!" భయంగా అరుస్తుంది కమల. "ఇక్కడంతా మరణమే అని చెప్పు! చీకటి గదిలోకి తోసి గడియవేసింతరవాత, ఇక పాపాయి కూడా ఏడవదని చెప్పు! పన్నెండు గంటలు, చీకట్లో. ఆకలితో భయంతో పాపాయి చచ్చిపోయిందని చెప్పు!"

ఆమెలో ఉద్రేకం. అలలా ఎగిసిపడింది. మంచంపైనుండి దబ్బున నేలపై పడి, శరీరంలో తుఫాను. ఏకండరమూ తన స్వాదీనంలో లేదు. నోటిలో గుడ్డలు కుక్కి... 'నర్స్, నర్స్'... అంటూ కేకలు వేశాను.

"ఇవాళ ఇది ఇరవై రెండో ఎటాక్! మైగాడ్!" ఇంజక్షన్ ఇస్తూ డాక్టరు. కాస్తదూరంగా నిలబడి" జాగ్రత్తగా వాచ్ చేస్తూఉండండి!" అంటూ సలహాయిచ్చివెళ్ళాడు.

కమలకు నిద్ర పట్టలేదు. నీరసంగా కళ్ళు తెరిచింది. "ఏదైనా మాట్లాడు అరుణా! ఎందుకో నిన్ను వినాలనిపిస్తుంది! నిన్నేకాదు. ఇంకా చాలా మందివి, గొంతుకలు వినాలని ఉంది. కోట్లమంది మానవుల భాషలన్నీ వినాలని ఉంది. ఇందాక చెప్పిన 'అమ్మ'ను వినాలని ఉంది! ఆమె దుఃఖాన్ని, పోరాటాల్ని ఆమెగొంతుకలో వినాలని ఉంది! రఘుని వినాలని ఉంది. నిరుద్యోగం, అశాంతి, అసహనంతో నిండిన అతని మాటల్ని వినాలని ఉంది. అన్నిటి కంటే ముఖ్యంగా నాపిల్ల ఏడుపు మళ్ళీ, మళ్ళీ వినాలని ఉంది." కమల ముఖంపై మళ్ళీ దుఃఖం. మృదువుగా చేతిని నొక్కాను. కళ్ళ చివరి నీళ్ళను తుడిచాను. బరువుగా రెప్పలు మూసి "మాట్లాడు! మాట్లాడు! ఏదైనా సరే! మాట్లాడు!" అంది.

నేను తుఫానుల గురించి మాట్లాడాను. ఎపి సెంటర్ గురించి మాట్లాడాను. హరికేన్ గురించి కూడా చెప్పాను. కాసేపు సోషల్ దీరీ గురించి చెప్పాను. మాస్‌సైకాలజీ గురించి కూడా. ఇవాళ ఉదయం జరిగిన సంఘటనల్ని కూడా చెప్పాను. వందలాదిగా జనం పోలీసు స్టేషన్‌పై దాడి చెయ్యటం గురించి చెప్పాను. స్టేషన్ తగలబెట్టటం గురించీ, పోలీసు కాల్పుల గురించి కూడా చెప్పాను. పౌరహక్కుల సంఘం గురించి కూడా. నిజనిర్ధారణ కమిటీ అంటూ వచ్చిన నలుగురు గురించి కూడా చెప్పాను. "బాస్టర్డ్స్!" అంటూ అందులోని ఒక అమ్మాయి పొగిలి పొగిలి ఏడవటం గురించికూడా చెప్పాను. "ఫిట్స్ వస్తుండగా రేప్ జరిగిందా? రేప్ జరిగాక ఫిట్స్ వచ్చాయా?" అంటూ వంకర చూపుతో అడిగిన పోలీసు అధికారి ఎంక్వయిరీ గురించి మాత్రం తనకు చెప్పలేదు.

కమల నిద్రపోయినట్లుగా ఉంది. బయట కూడా నిశ్శబ్దం! మత్తుగా, నిద్రగా ఉంది రాత్రి. డ్యూటీ డాక్టరు ఒకసారి. నర్సు రెండుసార్లు వచ్చిపొయ్యారు. దూరంగా వినపడీ వినపడనట్లుగా పోలీసు ట్రక్కుల అరుపులు, మోతలు.

రాత్రి భయంగా ఉంటుంది! కర్ఫ్యూ రాత్రి మరీను!

గదిలో అల్లంతదూరంలో రెండో మంచం కూడా ఉంది. తెరిచి ఉంచిన కాఫిన్‌లా. నిద్రగా అనిపించి అటువైపు నడిచాను. "మరీ దూరంగా వెళ్ళొద్దు!" కమల నిద్రలోనే అడుగుతుంది.

"భగవంతుణ్ణి చూడాలి! నిలదీసి చాలా ప్రశ్నలు అడగాలి!" కమలే కలవరింత కాబోలు!

"భగవంతుడు ఒక్కడే!"

"ప్రశ్న కూడా! ఒక్కటే!"

"పాపాయి కూడా! ఒక్కతే-ఒంటరిగా, అన్నిగంటలూ పెనుగులాడి, పెనుగులాడి-నాలుగు నెలల లేత శరీరం, అట్లాచనిపోవటం...." కమల నుదిటిపై చెయ్యివేసి, ప్రేమగా తలనిమిరి ముద్దాడి. 'ఊరుకో! ఊరుకో!' అంటూ ఓదార్చాను-కళ్ళు తెరిచి నావైపు తీక్షణంగా చూసింది. మెల్లగా తన కళ్ళు మూతలు పడ్డాయి. నిద్రలోకి జారింది.

గది హఠాత్తుగా నిశ్శబ్దం అయ్యింది. ఆరోజు పేపరు తీసుకొని. పెద్దగా చదవటం మొదలు పెట్టాను. సన్నటిశబ్దం. గదినిండా దొర్లాడు తున్నపదాలు.

చదువుతూ, చదువుతూ ఉండగానే నిద్రపట్టింది. పేపర్ జారవిడిచి బెడ్‌పై అట్లాగే వాలి పొయ్యాను.

నిద్రలో ఒక కల. అందంగా డెకరేట్ చెయ్యబడ్డ బొకేలా ఆమె మాయింటి కొచ్చింది. పెదవులపైనో పాట. సన్నగా హమ్‌చేస్తూ. 'దుఃఖం వద్దు! హింసవద్దు! నిశ్శబ్ధాలూవద్దు! పద ప్రపంచమంతా శబ్దాలతో నింపివేద్దాం!' అంటుంది.

హఠాత్తుగా మెలుకువ వచ్చింది. గదిలో హడావుడి. డాక్టర్లు నర్సులు, స్ట్రెచర్‌పై ఆమెను ఎక్కడికో తీసుకెళుతున్నారు! భయంగా అరిచాను. "ఎక్కడకు తీసు కెళుతున్నారు?" అని. "మార్చ్యురీకి..." డాక్టరు గొంతు చల్లగా ఉంది. బయట కర్ఫ్యూ కొనసాగుతూనే ఉంది.

*మరోదారి, మార్చి '98*